ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 24.04.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

2. హక్కుల సాధన కోసం ఆర్టీసీ కార్మికులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు తెలిపారు.

3. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

4. రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

**ఆర్టీసీ డ్రైవర్ మృతి**

తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆత్మహత్యాయత్నం చేసిన ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ ఈ తెల్లవారుజాము మృతి చెందారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్, నిన్న పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా.. చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించారు. దాదాపు 80 శాతం కాలిన గాయాలతో శంకర్ గౌడ్ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని ముత్తోజిపేట గ్రామానికి తీసుకొచ్చారు. కాగా, ఈరోజు నర్సంపేట పట్టణ బంద్ కు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

నర్సంపేట డిపో వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పీటీసీ - వరంగల్**

**ముఖ్యమంత్రి - ఆర్టీసీ**

ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచిందని విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

**డెస్క్**

**ఆర్టీసీ సమ్మె**

తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె మూడో రోజు కొనసాగుతోంది. జిల్లాల్లోని ఆయా డిపోల వద్ద కార్మికులు నిరసనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సమ్మెతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికులు లేక బస్టాండ్‌లు వెలవెలబోతున్నాయి.

**డెస్క్**

**ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో చర్చలు**

సచివాలయంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో అధికారులు సమావేశమయ్యారు. ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతితో నెలకొన్న ఉద్విగ్న పరిస్థితుల నేపథ్యంలో, ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో ఆర్టీసీ జేఏసీ నాయకులు సచివాలయానికి చేరుకున్నారు. అంతకుముందు, యూనియన్ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమైన

నేతలు, కార్మికుల డిమాండ్లపై చర్చించారు. ప్రస్తుతం సచివాలయంలో సీనియర్ ఐఏఎస్ కమిటీ సభ్యులతో జేఏసీ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల సబ్ కమిటీతో కార్మిక సంఘాలు చర్చలు జరపనున్నాయి.

పిటిసి, హైదరాబాద్

**పొన్నం ప్రభాకర్**

ఆర్టీసీ కార్మికులు అధైర్య పడవద్దని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్మికులు ఆవేశానికి లోనై అఘాయిత్యాలకు పాల్పడవద్దని, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు తెలపవచ్చని అన్నారు. అయితే, రాజకీయ పార్టీలు కార్మికులను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు.

పిటిసి, హైదరాబాద్

**కేటీఆర్**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం పట్ల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు చేస్తున్న ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. హక్కుల సాధన కోసం ప్రాణత్యాగం చేసిన కార్మికుడి పార్థివదేహానికి నివాళులర్పించేందుకు కూడా అనుమతించకపోవడం బాధాకరమని అన్నారు. డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**డెస్క్**

**బండి సంజయ్**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల కేంద్రమంత్రి బండి సంజయ్ విచారం వ్యక్తం చేశారు. కాలయాపన కోసం కమిటీలు వేసి మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. ఈరోజు కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలనే అమలు చేయలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారని ఆయన అన్నారు.

**బైట్ - బండి సంజయ్**

**డెస్క్**

**హరీష్ రావు..**

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణంపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆయన ఎక్స్ వేదికగా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీనం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. మేనిఫెస్టో వాగ్దానాలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కార్మికులు.. అధైర్యపడవద్దని, హక్కుల సాధన కోసం సంఘటితంగా కలిసి పోరాడుదామని హరీష్ రావు కార్మికులకు పిలుపునిచ్చారు.

**HYD -PTC**

**కొండ విశ్వేశ్వర్ రెడ్డి**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గాని ఆర్టీసీకి మేలు జరగలేదని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఈరోజు ఖమ్మం డిపో వద్ద ఆందోళన చేపడుతున్న ఆర్టీసీ కార్మికులకు ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి సమ్మెను విరమింప చేయాలని డిమాండ్ చేశారు.

**పీటీసీ - ఖమ్మం**

**పంచాయతీ రాజ్ దినోత్సవం**

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశాభివృద్ధిలో గ్రామ పంచాయతీలే కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామీణ వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు అనే సత్యాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, ప్రజాప్రభుత్వం అందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. స్థానిక స్వపరిపాలనకు ప్రతీకలైన పంచాయతీలు బలంగా, సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందన్నారు. స్థానిక స్వయం పరిపాలన గ్రామీణ ప్రజల జీవితాల్లో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులతో పాటు స్వయం సమృద్ధి దిశగా గ్రామీణ భారతదేశాన్ని ముందుకు నడిపిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**డెస్క్**

**ఆది శ్రీనివాస్**

కాళేశ్వరం ద్వారా ఎన్ని టీఎంసీలు నీరు ఇచ్చారో ఇంత వరకు లెక్కలు ఎందుకు చెప్పలేదని, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు అది శ్రీనివాస్ వాఖ్యానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..

**బైట్ -ఆదిశ్రీనివాస్, శాసనసభ్యులు**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

**ఎఫ్ టీసీసీఐ 2026 అవార్డ్స్**

ఎఫ్టిసీసీఐ 2026 వార్షిక అవార్డులను 21 రంగాల్లో ప్రముఖ వ్యాపారవేత్తలకు ఇవ్వనున్నట్లు ఎఫ్టీసీసీఐ అధ్యక్షుడు ఆర్. రవికుమార్ తెలిపారు. ఈరోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన... ఎఫ్టీసీసీఐ ప్రతిష్టాత్మకంగా గత 52 సంవత్సరాలుగా వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. మే 10వ తేదీ లోపు ఈ అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. మే 22న ఈ అవార్డులను ప్రదానం చేస్తారని తెలిపారు. అవార్డుల ప్రధానోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని

ఆహ్వానించామని రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ గరిమెళ్ల, కె.కె. మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**ఎంఎస్ఎం**

**వాతావరణం..**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు **ఎల్లో అలర్ట్** జారీ చేసింది. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత పెరిగింది. నిన్న జిల్లాలో పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**పీటీసీ- భద్రాద్రి కొత్తగూడెం**